సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం ı 20 ı ఏప్రిల్ ı 2024



తమ్ముడిని నాటు తుపాకీతో కాల్చిన అన్న అరెస్ట్

ఆస్తి పంపకం వివాదంలో తమ్ముడ్ని నాటు తుపాకీతో కాల్చిన అన్న జయప్ప (56)ను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



లిఫ్ట్ రోప్ తెగి ఏడుగురికి తీవ్ర గాయాలు

రాయచోటి పట్టణంలో వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో లిఫ్ట్ రోప్ తెగి శుక్రవారం ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.190
రెండోరకం	రూ.100	రూ.140

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 187 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు దక్షిణాంధ్ర ధర్మాచార్యుల సమ్మేళనం

కడప కల్చరల్: విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర ధర్మాచార్యుల సమ్మేళనం శనివారం నిర్వహించనున్నారు. కడప నగర శివార్లలోని చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ లలితా పంచాయతన దేవాలయంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ సమ్మేళనం నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్, ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడులను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

సంబేపల్లె పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కొండయ్య

సంబేపల్లె: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అన్నమయ్య జిల్లా వైద్యాధికారి కొండయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్ పరిశీలించి కాన్పులపై సంబంధిత సిబ్బంది ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగీ వ్యాధులపై గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు షర్మిల నామినేషన్

కడప వైఎస్ఆర్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ షర్మిల శనివారం నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో ర్యాలీ నిర్వహించి ఉదయం 11.10 గంటలకు నామిషన్ వేస్తారన్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు.

నవోదయలో అట్టహాసంగా జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలు



నవోదయలో ప్రేరణ మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

రాజంపేట: రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి ప్రేరణ మహోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. ఏపీ నుంచి 9 నుంచి 12వ తరగతి వరకు చదివే 10మంది బాలురు, 10 మంది బాలికలు గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో జరిగే శిక్షణకు ఎంపికయ్యారు. ఈనెల 19 నుంచి రాజంపేట నవోదయ విద్యాలయంలో మై విజన్ ఫర్ ఇండియా, వికసిత్‌భారత్ అనే అంశాలపై వ్యాసరచన, పెయింటింగ్, వక్తృత్వపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గీత, అన్నమయ్య అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రామకృష్ణ, పుల్లంపేట ఎంఈఓ చక్రధర్ పాల్గొన్నారు.

లఘు చిత్రాలు, ఫొటో, వీడియో పోటీలు

రాయచోటి: సార్వత్రిక ఎన్నికలు–2024కు సంబంధించి అన్నమయ్య జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశాల మేరకు రెండు పోటీలను ప్రకటించినట్లు జిల్లా స్విప్ కార్యక్రమాల నోడల్ అధికారి పి.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అన్నమయ్య జిల్లాలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఈ పోటీల వివరాలను ప్రకటించారు. మొదటి పోటీ ఎన్నిక అంశాలకు సంబంధించి కొత్తగా తయారు చేసిన లఘు చిత్రాల పోటీ ఉంటుందన్నారు. జిల్లాలోని ఔత్సాహిక కళాకారులు, రచయితలు, కళాకారులు ప్రస్తుత ఎన్నిక అంశాలు ఇతివృత్తంగా తీస్తున్న లఘు చిత్రాలను పోటీకి అనుమతిస్తామన్నారు. ఈ లఘు చిత్రాలు ఇంత వరకూ ఎక్కడా ప్రదర్శించి ఉండకూడదని, అలాగే కాపీరైటు ధ్రువీకరణ పత్రంతో పాటు 2024 ఏప్రిల్ 30వ తేదీ లోపున జిల్లా కలెక్టరేట్‌లోని స్విప్ సూపరింటెండెంట్ సతీష్ (సెల్ నెంబరు. 9010652595)కు సమర్పించాలన్నారు. రెండవ పోటీగా ఉత్తమ ఫొటో లేదా వీడియో ఎన్నికల మాదిరి ప్రవర్తన నియమావళిని అతిక్రమించిన అంశాలకు సంబంధించి ఉండాలని తెలిపారు. జిల్లాలోని అధీకృత విలేకరులకు ఈ పోటీ ఉంటుందని పేర్కొన్నారు. వీటిని ఏప్రిల్ 30వ తేదీలోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలకు సంబంధించిన ప్రతిపాదనలను మే 4వ తేదీన పరిశీలించి 6వ తేదీన విజేతలను ప్రకటిస్తారన్నారు. మే నెల 13 తరువాత జరిగే ప్రత్యేక ఎన్నికల సమావేశంలో బహుమతుల తోపాటు విజేత ప్రకటన, సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ ద్వారా అందజేస్తామని తెలిపారు.

నామినేషన్ల జోరు

- అన్నమయ్య జిల్లాలో 18 నామినేషన్లు
- పార్లమెంటుకు 5, ఎమ్మెల్యేలకు 13 నామినేషన్లు దాఖలు
- మిథున్‌రెడ్డి తరపున నామినేషన్ వేసిన మైనార్టీలు



రాజంపేట లోక్‌సభ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న మైనార్టీ నేతలు

రాయచోటి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో రెండవ రోజైన శుక్రవారం 18 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ తెలిపారు. శుక్రవారం రాజంపేట–24 పార్లమెంట్ స్థానంతో పాటు 5 అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. రాజంపేట అసెంబ్లీ స్థానానికి రెండవ రోజున నామినేషన్లు దాఖలు కాలేదు.

పార్లమెంటుకు 5 నామినేషన్లు

- రాజంపేట–24 పార్లమెంట్ స్థానానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పీవీ మిథున్‌రెడ్డి తరపున జిల్లాలోని మైనార్టీలు రెండో నామినేషన్ దాఖలు చేశారు.
- ఇండిపెండెంట్ అభ్యర్థిగా కస్తూరి ఓబయ్యనాయుడు రెండు సెట్ల నామినేషన్లను పార్లమెంట్ రిటర్నింగ్ అధికారికి అందజేశారు.
- ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఆసాది వెంకటాద్రి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

అసెంబ్లీకి 13 నామినేషన్లు

శుక్రవారం రెండో రోజున అసెంబ్లీ అభ్యర్థులుగా 13 మంది ఆయా ప్రాంతాలలోని రిటర్నింగ్ అధికారుల వద్ద నామినేషన్లు దాఖలు చేశారు.

128– రాయచోటి అసెంబ్లీ స్థానానికి

- టీడీపీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- షేక్ అల్లాబకష్ ఐఎన్‌సీ అభ్యర్థిగా ఒక్కొక్క సెట్టు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

127 – కోడూరు(ఎస్సీ)

- అరవ శ్రీధర్ జనసేన అభ్యర్థిగా రెండు పత్రాల నామినేషన్లు
- గోసల దేవి ఐఎన్‌సీ అభ్యర్థిగా ఒక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

162 – తంబళ్లపల్లి:

- పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా, దాసరపల్లి జయచంద్రారెడ్డి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే మంత్రి కల్పన కూడా టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

163 – పీలేరు:

- నల్లారి అమరనాథ్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

164 – మదనపల్లి: ఎం.భాస్కర్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా, ఎం.షాజహాన్‌బాషా టీడీపీ అభ్యర్థిగా, అలాగే ఇండిపెండెంట్ అభ్యర్థిగా కూడా మరో నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు.

- శుక్రవారం రెండో రోజున 24–రాజంపేట పార్లమెంటుకు 05,
- 125–రాజంపేట అసెంబ్లీకి 00,
- 127–కోడూరుకు 03,
- 128–రాయచోటికి 02,
- 162–తంబళ్లపల్లికి 03,
- 163–పీలేరుకు 02,
- 164–మదనపల్లెకు 03 నామినేషన్ల వంతున మొత్తం 13 నామినేషన్లు అందాయి.

పటిష్ట బందోబస్తు ..

సార్వత్రిక ఎన్నికల రెండవ రోజు జరిగిన నామినేషన్ల కార్యక్రమానికి పోలీసులు మూడంచెల విధానంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో పార్లమెంట్ రిటర్నింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డీఓ కార్యాలయాలలో అసెంబ్లీలకు, పీలేరు, తంబళ్లపల్లి, కోడూరులలోని తహసీల్దార్ కార్యాలయాలలో ఎమ్మెల్యేల నామినేషన్లను స్వీకరించే ఏర్పాటు చేశారు. ఆయా కార్యాలయాల ప్రాంగణాలలో బారికేడ్లు ఏర్పాటు చేసి ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు.

వైఎస్సార్ జిల్లాలో..

- రెండోరోజు 14 నామినేషన్ల దాఖలు
- పార్లమెంటుకు 2
- అసెంబ్లీలకు 12
- బద్వేలు, పులివెందుల, కమలాపురంలో నిల్

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో రెండవ రోజైన శుక్రవారం మొత్తం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో కడప లోక్‌సభ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కాకర్ల షణ్ముఖరెడ్డి ఒక్కొక్క సెట్టు చొప్పున నామినేషన్ దాఖలు చేశారు.

అసెంబ్లీ స్థానాలకు: ఇక అసెంబ్లీ స్థానాలకు సంబంధించి బద్వేలు, కమలాపురం, పులివెందులలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కడప అసెంబ్లీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా కోనేటి హరి వెంకట రమణ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరుపున సయ్యద్ సలావుద్దీన్ ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. జమ్మలమడుగు అసెంబ్లీకి భారతీయ జనతా పార్టీ తరుపున చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ఒక సెట్, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మూలె సుధీర్‌రెడ్డి తరుపున ఆ పార్టీ నాయకులు ఒక సెట్, వైఎస్సార్ సీపీ తరుపున మూలే క్రాంతిప్రియ మరొక సెట్, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ తరపున రామదాసు కాటా ఒక సెట్ దాఖలు చేశారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరపున నంద్యాల వరదరాజులరెడ్డి, నంద్యాల కొండారెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా వెంకట ప్రసాద్‌రెడ్డి బొల్లవరం, భరోసా పార్టీ అభ్యర్థిగా చింతల శోభన్ బాబు ఒక్కొక్క సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారు. మైదుకూరు అసెంబ్లీ స్థానంలో అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాజా రామిరెడ్డి సిరయపురెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున రఘురామిరెడ్డి శెట్టిపల్లె ఒక్కొక్క సెట్ చొప్పున నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు.



నామినేషన్‌పత్రాలను జిల్లా ఎన్నికల అధికారికి అందజేస్తున్న వైఎస్.అవినాష్‌రెడ్డి, సురేష్‌బాబు

అసెంబ్లీకి రూ. 40 లక్షలు, లోక్ సభకు రూ. 95 లక్షలు

ఎన్నికల ఖర్చును వెల్లడించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు



ఎన్నికల వ్యయంపై సమీక్ష చేస్తున్న అధికారులు

రాయచోటి: అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయబోయే అభ్యర్థుల వ్యయం రూ. 40 లక్షలు, లోక్ సభకు రూ. 95 లక్షలకు మించరాదని ఎన్నికల వ్యయ పరిశీలకులు రవీందర్ కుమార్, ఎస్‌జీ మూన్, వైభవ్ శుక్లా తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు–2024కు సంబంధించి భారత ఎన్నికల సంఘంచే జిల్లాకు నియమితులైన వ్యయ పరిశీలకులు శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో అన్నమయ్య జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ, ఎంసీఎంసీ కమిటీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ కమిటీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి, ఎన్నికల నిర్వహణ (సవరణ) నియమాలు, 2022లోని నియమం 90 ప్రకారం అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలలో పోటీ చేయబోయే అభ్యర్థుల ఖర్చు మించరాదని పేర్కొన్నారు.

రోజువారీగా నివేదికలు.....

జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ, జిల్లాలో అసెంబ్లీ, లోక్ సభ స్థానాలకు పోటీ చేయబోయే అభ్యర్థుల వ్యయాన్ని ప్రతిరోజూ పరిశీలించి రోజువారి నివేదికను వారికి పంపాలన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచే అతని ఖాతాలలో ఖర్చు నమోదు చేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించాలన్నారు. మే నెలలో మరో మూడుసార్లు వ్యయ పరిశీలకులు వ్యయ పర్యవేక్షణ కమిటీతో సమావేశం అవుతారన్నారు. ఎన్నికలలో పోటీ చేయబోయే అభ్యర్థుల వ్యయానికి సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేస్తారన్నారు. సబ్ డీఎఫ్‌ఓ, ఒక పార్లమెంటు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన వ్యయ కమిటీ సభ్యులు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుగవాసిపై బత్యాల చిర్రుబుర్రు



బత్యాల కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట: రాజంపేట అసెంబ్లీ టికెట్ విషయంలో టీడీపీ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి సుగవాసిపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు శివతాండవం చేసిన అంశం టీడీపీ వర్గాల్లో కలకలం రేపింది. విశ్వసనీయవర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు.. గురువారం బత్యాల కార్యాలయానికి టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం మద్దతు కోరేందుకు వెళ్లారు. అక్కడ జరిగిన సంభాషణలు టీడీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఐదేళ్లగా పార్టీని కాపాడుకుంటూ, క్యాడర్‌కు అండగా ఉంటూ వస్తే తనకు కాకుండా రాయచోటి నేతకు ఇవ్వడంపై బత్యాల ఆగ్రహంగా ఉన్నారు.

బత్యాల ఇంటివద్ద అకస్మాత్తుగా ప్రత్యక్షమైన సుగవాసి..

టికెట్ తనకు ఇవ్వలేదన్న కసిలో ఉన్న బత్యాల నివాసానికి ఎలాంటి సమాచారం లేకుండా ఉన్నఫళంగా సుగవాసి వెళ్లారు. తన నివాసానికి తీసుకొచ్చిన మున్సిపల్ కౌన్సిలర్ తుపాకుల అశోక్‌పై బత్యాల విరుచుకు పడ్డారు.

కళ్లకు ఏమైనా చత్వారి వచ్చిందా..!

టికెట్ ప్రకటించిన 24 రోజుల తర్వాత నన్ను కలుస్తావా? కళ్లకు ఏమైనా చత్వారీ వచ్చిందా? తిరుపతి ఎయిర్‌పోర్టులో కలిసినప్పుడు నీవు, నీ తమ్ముడు ప్రసాద్ నాతో ఏమన్నారు.. మేము ఎంపీ సీటుకు పోటీ చేస్తాం.. మీరు ఎమ్మెల్యేగా పోటీ చేయండి అన్నారు కదా. ఇప్పుడు రాజంపేట సీటు కోసం ఎందుకువచ్చారు అని గట్టిగా ప్రశ్నించారు. అసలు నీకు బుద్ధి ఉందా? నేనేమైనా మీ సీటు కోసం రాయచోటికి వచ్చానా.. అంటూ నిలదీశారు.

అధిష్టానం చెబితే ఎలా మార్చుకుంటావు?

రాయచోటి సీటు మీకు పెళ్లాం లాంటిదని, రాజంపేట సీటు నాకు పెళ్లాం లాంటిదని.. అధిష్టానం చెబితే ఎలా మార్చుకుంటామని, కొంచెమైనా మనకు పౌరుషం ఉండాలని ఊదరగొట్టారు. అధిష్టానం చెబితే నేను పోటీ చేస్తున్నాని చెప్పిన క్రమంలో బత్యాల తీవ్ర స్వరంతో స్పందించారు. దీంతో సుగవాసి మనస్థాపానికి గురై మారు మాట్లాడకుండా బయటికి వచ్చేశారు.

బెడిసి కొట్టిన కమ్మ, బలిజ నేతల మధ్యవర్తిత్వం

కాగా ముందుగా బత్యాల, సుగవాసిని ఒకటి చేసేందుకు కమ్మ, బలిజ నాయకులు చేసిన మధ్యవర్తిత్వం బెడిసికొట్టింది. ఆ నేతలకు బత్యాల నుంచి అక్షింతలు పడ్డాయి. నేను ఏమైనా పసుపులేటి బ్రహ్మయ్య అనుకున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో కమ్మనేత కూడా ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా గట్టిగా మందలించారు. ఈ విధంగా బత్యాల, సుగవాసి మధ్య చోటుచేసుకున్న సంభాషణలపై టీడీపీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

రామా.. కరుణజూపుమా



గ్రామోత్సవంలో భక్తులకు అభయమిస్తున్న వటపత్రశాయి



అలరిస్తున్న కోలాట ప్రదర్శన

- వటపత్రశాయిగా దాశరథి దర్శనం
- మూడోరోజు చూడ ముచ్చటగా సీతాపతి బ్రహ్మోత్సవం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజు శుక్రవారం ఉదయం స్వామివారు వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారి ఊరేగింపు జరిగింది.భక్త బృందాల భజనలు, కళాకారుల కోలాటా నడుమ స్వామివారు పురవీధుల్లో విహరించారు. గ్రామోత్సవం అనంతరం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనే, చందనంతో శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి సింహ వాహనంపై సీతాపతి ఊరేగారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. ఉదయం నిద్ర లేవగానే దర్శించే వస్తువుల్లో 'సింహదర్శనం'అతి ముఖ్యమైంది. సింహ రూప దర్శనంతో సోమరితం నశించి, పట్టుదలతో ప్రవర్తించి సర్వత్రా విజయులమై ఆధిపత్యంతో రాణించే స్ఫూర్తి సిద్ధిస్తుంది. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను , నా వాహనమైన సింహమూ సమాన ప్రయత్నంతో ఉంటామని ఈ సింహ వాహనం ద్వారా స్వామి వారు నిరూపిస్తున్నారు. ఒంటిమిట్ట ఆలయ డిప్యూటి ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు శనివారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో జగదభిరాముడు భక్తులకు దర్శనమిస్తారు. 7 నుంచి 9 గంటల వరకు పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు ఉంటుంది. 11 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9:00 గంటలకు హనుమంత వాహనం సేవ ఉంటుంది. వాహనసేవల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కోలాటాలు, కేరళ వాయిద్యాలు, తాళం భజన ప్రదర్శనలు ఉంటాయి.

ఖాన్‌దాదాతో గేమ్స్

- కడపలో సామాజిక కుట్రలకు తెర లేపుతున్న టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి
- ఇటీవల వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసిన అఫ్జల్‌ఖాన్‌కు ఎర
- కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయించాలని ప్లాన్
- రూ.5కోట్లు ఫండ్ ఇస్తామని ప్రలోభాలు
- ముస్లిం మైనార్టీల ఓట్లు చీల్చడమే లక్ష్యంగా ఎత్తుగడలు



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ కరువవుతోంది. కుట్రలు, కుయుక్తులతో మద్దతు పెంచుకోవాలనే దిశగా నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారు. సామాజిక సమీకరణలకు తెరలేపుతూ తద్వారా లబ్ధి పొందాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో ముస్లిం మైనార్టీ ఓటర్ల మధ్య గణనీయంగా చీలికలు తీసుకు రావాలనే ఎత్తుగడలకు తెరలేపారు. ఆమేరకు వైఎస్సార్‌సీపీకి ఇటీవల రాజీనామా చేసిన ఓ నాయకున్ని ఎంచుకున్నారు. రూ.5కోట్లు ఫండ్ ఇస్తాను, కాంగ్రెస్ అధ్యక్షురాలితో తానే మాట్లాడి టికెట్ ఇప్పిస్తాను. వారు కూడా మరో రూ.5కోట్లు ఫండ్ ఇస్తారు. పోటీచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. కడప అసెంబ్లీ పరిధిలో త్రిముఖ పోటీ పెట్టించి లబ్ధి పొందాలనే ఆలోచనను అమల్లోకి తెస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీకి చెందిన మైనార్టీ నాయకుడు అఫ్జల్‌ఖాన్ ఇటీవల పార్టీకి రాజీనామా చేశారు. ఆ పార్టీలో అనుకున్నస్థాయిలో ప్రాధాన్యత దక్కలేదనే భావనను వ్యక్త పర్చారు. అదే అదునుగా భావించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి నేరుగా అఫ్జల్‌ఖాన్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆ పార్టీ టికెట్ ఇప్పించే బాధ్యత తనదేనని చెప్పుకొచ్చినట్లు సమాచారం. వ్యక్తిగతంగా తాను రూ.5కోట్లు ఫండ్ ఇస్తానని, మరో రూ.5కోట్లు కాంగ్రెస్ పార్టీ కూడా ఇస్తుందని, ఆమేరకు రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలతో కూడా హామీ ఇప్పిస్తానని చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. కడప అసెంబ్లీకి త్రిముఖ పోటీ ఉండాలని, అందుకు మీరే సరైన నాయకుడంటూ అఫ్జల్‌ఖాన్‌తో మంతనాలు నిర్వహించినట్లు సమాచారం. తద్వారా మీకు ప్రత్యేక గుర్తింపు దక్కుతుందని కూడా వివరించినట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత టీడీపీలో కూడా తగిన ప్రాధాన్యత ఇప్పించే బాధ్యత కూడా తనదేనని చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. కాగా, మైనార్టీ నేత అఫ్జల్‌ఖాన్ వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేయకముందు ఆయన సోదరుడు అఫ్సర్‌ఖాన్ తెలుగు దేశం పార్టీలో చేరారు. అప్పట్లో కడప వాసులు ఒకింత ఆశ్చర్యానికి గురైనా తాజా పరిణామాల నేపథ్యంలో వ్యూహాత్మక ఎత్తుగడలకు ఆనాడే బీజం పడినట్లుగా విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మొన్న జయాగార్డెన్‌లో వాసు, అఫ్జల్‌ఖాన్, సునీతారెడ్డి సమావేశమైనట్లు సమాచారం.

కుటుంబంలో ఏకాకిగా మిగలడంతో....

రెడ్డెప్పగారి కుటుంబంలో శ్రీనివాసులరెడ్డి ఏకాకి అయ్యారు. ఆయన వ్యవహార శైలి నచ్చకపోవడం, చంద్రబాబునాయుడు కుటుంబాలను విభజించి పాలించు అనే సూత్రాన్ని అమలు చేయడం ఇలాంటి కారణాలతో సోదరుడు మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి టీడీపీ వీడారు. అలాగే మేనమామ కుమారుడు మాజీ శాసనమండలి సభ్యుడు ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి సైతం తెలుగుదేశం పార్టీ వదిలేశారు. సుదీర్ఘకాలం చిత్తశుద్ధితో తెలుగుదేశం పార్టీ ఉన్నతికి పనిచేసిన వారిని జిల్లా అధ్యక్షుడిగా పొలిట్‌బ్యూరో సభ్యుడుగా శ్రీనివాసులరెడ్డి నిలుపుకోలేకపోయారు. ఈపరిస్థితుల్లో కడపలో పట్టు సాధించుకోవాలనే లక్ష్యంతో వ్యవహరిస్తున్నట్లు సమాచారం. తద్వారా అటు పార్టీలో ఇటు కుటుంబంలో పట్టు నిలుపుకోవచ్చనే ఆలోచనలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ఎలాగైనా మైనార్టీ ఓటర్లుల్లో చీలిక తీసుకొచ్చి, రెడ్డి సామాజిక వర్గానికి దగ్గరగా ఉంటూ లబ్ధిపొందాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఆమేరకు ప్రతి చిన్న అంశాన్ని సైతం రెచ్చగొట్టి రాజకీయం చేస్తూ లబ్ధి పొందే ఎత్తుగడలను పాటిస్తున్నారు. ఆమేరకు చలమారెడ్డిపల్లె, మాసాపేట సర్కిల్‌లో చోటు చేసుకున్న ఉదంతాలనను పరిశీలకులు ఉదహరిస్తున్నారు.

త్రిముఖ పోటీ ఉంటే...

కడప అసెంబ్లీ పరిధిలో ప్రధాన భూమిక ముస్లిం మైనార్టీ ఓటర్లదేనని చెప్పాలి. ఎందుకంటే దాదాపుగా 90వేల ఓట్లు ఆ సామాజిక వర్గానికి చెందిన వారివి ఉన్నట్లు సమచారం. ఆ ఓట్లు ఏకపక్షంగా పడకుండా చీలికలు తీసుకరాగలిగితే సక్సెస్ అవుతామనే దిశగా టీడీపీ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా కులాల కుంపట్లు ఎప్పుడు లేని విధంగా ఈమారు బాహాటంగా తెరపైకి వచ్చాయి. భిన్నత్వంలో ఏకత్వంగా ఉండే కడపగడపలో పలువురు రెచ్చగొడుతూ లబ్ధి పొందాలనే దిశగా అడుగులు వేశారు. ఇప్పటికే ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన ఎస్‌బి అంజాద్‌బాషా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మరోమారు పోటీ చేయనున్నారు. టీడీపీ అభ్యర్థిగా శ్రీనివాసులరెడ్డి సతీమణీ మాధవీరెడ్డి పోటీలో ఉన్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా అఫ్జల్‌ఖాన్‌ను పోటీ చేయిస్తే తద్వారా లబ్ధి పొందొచ్చని శ్రీనివాసులరెడ్డి ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం.



లిఫ్ట్ రోప్ తెగి ఏడుగురికి తీవ్ర గాయాలు

– ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రమాదం


లిఫ్ట్‌లో కాలు విరిగిన బాధితుడు


తీవ్రంగా గాయపడిన మహిళను ఆటో ఎక్కిస్తున్న బంధువులు


తీవ్రంగా గాయపడిన మహిళ

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో లిఫ్ట్ రోప్ తెగి శుక్రవారం ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కదిరివాండ్లపల్లె చెందిన ఒక వ్యక్తి అనారోగ్యంతో ఈ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ పేషెంట్‌ను చూసేందుకు బంధువులు, మిత్రులు వచ్చారు. సుమారు పది మంది వరకు ఆస్పత్రి లిఫ్ట్‌ను ఎక్కారు. సగం దూరం వెళ్లగానే ఒకసారిగా రోప్ తెగిపోవడంతో లిఫ్ట్ బాక్స్ ఒకసారిగా కిందకు వచ్చి పడింది. అందులో ఉన్న వారిలో ఏడుగురికి కాళ్లు చేతులు విరిగాయి. ఈ భవనం రాయచోటి తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకుడి బంధువుకు చెందినది. కొత్తగా నిర్మించిన ఈ ఆస్పత్రి భవన నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం వలన ప్రమాదం జరిగిందని ఆరోపణలు వినవస్తున్నాయి. అయితే ప్రమాదం విషయం బయటికి పొక్కనీయకుండా ఆస్పత్రి యాజమాన్య, టీడీపీ నాయకులు కొందరు చాలా జాగ్రత్త వహించారు. అదే ఆస్పత్రిలో క్షతగాత్రులకు తగు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రికి తరలించారు. నష్టపరిహారం చెల్లించడంతో పాటు వైద్య ఖర్చులు కూడా భరిస్తారని నచ్చచెప్పారు. దీనిపై పోలీసులను వివరణ అడుగగా తమ వద్దకు ఫిర్యాదు చేయడానికి ఎవరూ రాలేదన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

రామసముద్రం : రామసముద్రం పంచాయతీ కేంద్రమైన ఎగువ హరిజనవాడలో శుక్రవారం టీడీపీకి చెందిన యువకులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్ అధ్యక్షతన 30 మందికి పైగా యువకులు మాజీ కన్వీనర్ భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన యువకులకు నిస్సార్ అహమ్మద్ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. మరోసారి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, నాయకులు ప్రకాష్, దర్శన్, సుదర్శన్, బాబు, ప్రభాకర్, తపాల మస్తాన్, షంషీర్, కృష్ణప్ప, మస్తాన్, ఉదయ్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

80 మంది వైఎస్‌ఆర్‌సీపీలో చేరిక

పుల్లంపేట : పుల్లంపేట మండలం, కొమ్మనవారిపల్లి పంచాయతీలోని అగ్రహారానికి చెందిన 80 మంది టీడీపీ నాయకులు శుక్రవారం రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డిల ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వంలో తమ గ్రామానికి రోడ్డు వచ్చినందుకు జగనన్నకు రుణపడి ఉంటామని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


రామసముద్రంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులతో నిస్సార్ అహమ్మద్

వైఎస్సార్ సీపీలో చేరిక

కలకడ : మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ గోగుల శ్రీనివాసయాదవ్ తన అనుచరులతో వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం మండల ప్రత్యేక ఆహ్వానితులు జీవీ కిషోర్ ఆధ్వర్యంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వారికి వైఎస్సార్‌సీపీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శేఖర్ యాదవ్, పీలేరు నియోజకవర్గ సోషియల్ మీడియా కోకన్వీనర్ చిరంజీవి యాదవ్, సచివాలయ కన్వీనర్ పుల్లయ్యగౌడ్, రమణయాదవ్, పవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కొరముట్ల , ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి


శ్రీనివాసయాదవ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల

వైఎస్సార్‌సీపీ వెంటే మైనార్టీలు


ఎంపీ మిథున్ రెడ్డి తరపున నామినేషన్ పత్రాలను అందజేయడానికి రాయచోటికి వచ్చిన మైనార్టీలు

రాయచోటి : రాష్ట్రంలోని మైనార్టీలంతా వైఎస్సార్ సీపీ వెంటే నడుస్తారని ఆ పార్టీ రాయలసీమ జోన్ మైనార్టీ ఇన్‌చార్జి ఎస్.ఫక్రుద్దీన్ షరీఫ్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ముజీబ్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా అన్నారు. శుక్రవారం రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి పీవీ మిథున్ రెడ్డి తరపున అన్నమయ్య జిల్లా రాయచోటి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను వారు అందజేశారు. ఈ సందర్భంగా రాయచోటిలో వారు మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిలు మైనార్టీలపై చూపుతున్న అభిమానాన్ని మరువలేమన్నారు. నామినేషన్ దాఖలుకు ముందుగా మైనార్టీ నాయకులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి రియాసత్ అలీఖాన్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల మైనార్టీ అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్, సయ్యద్, అన్నమయ్య జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, పీలేరు మాజీ సర్పంచ్ హబీబ్, మదనపల్లి మైనార్టీ నాయకులు ఎం. అహ్మద్, కరీమ్ భాయ్, హెచ్‌ఎం అఫ్రోజ్ ఖాన్, డి.ఫక్రుల్లా ఖాన్, పీలేరు అమీన్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యత పాటించకపోతే కఠిన చర్యలు


వస్తువుల నాణ్యత తనిఖీ చేస్తున్న అధికారులు

రాయచోటి అర్బన్ : హోటళ్లు, తిండి పదార్థాల తయారీదారులు ప్రజలకు శుచి,శుభ్రతతో కూడిన ఆహారాన్ని అందివ్వాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి శమీమ్‌బాష అన్నారు. శుక్రవారం సాయంత్రం వారు మున్సిపల్, ఫుడ్‌సేఫ్టీ అధికారులతో కలసి పట్టణంలోని పలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిండిపదార్థాల తయారీలో తప్పక నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరిలు, జ్యూస్‌సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితరాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. తమ తనిఖీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ మల్లిఖార్జున, ఫుడ్‌సేఫ్టీ సిబ్బంది సీతారామయ్య పాల్గొన్నారు.

పీడీ గోపినాథ్‌పై ఉన్నతాధికారుల విచారణ

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీడీ గోపినాథ్‌పై ఉన్నతాధికారులు విచారణ చేశారు. గత ఏడాది నవంబర్ నెలలో పీడీ గోపినాథ్‌పై పదో తరగతి విద్యార్థిని తనను లైంగికంగా వేధిస్తున్నాడని హెచ్‌ఎంకు ఫిర్యాదు చేసింది. దీంతో అప్పట్లో డీఈఓగా ఉన్న పురుషోత్తం విచారణ చేశారు. ఈ సంఘటనలో పీడీ గోపినాథ్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు చేశారు. ఈ విషయంపై అప్పట్లో పోలీసు స్టేషన్‌లో కూడా కేసు నమోదైంది. జరిగిన సంఘటనపై విద్యాశాఖ ఏడీ ప్రసాద్‌బాబు, జీసీడీఓ రాధమ్మ శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులను వేర్వేరుగా విచారణ చేశారు. జరిగిన సంఘటనపై రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని ప్రశ్నపత్రం ద్వారా విద్యార్థులకు అందజేశారు. వీరి నుంచి పూర్తి స్థాయిలో వివరాలు రాబట్టారు. బాధిత విద్యార్థినితో పాటు తల్లిని కూడా విచారించారు. విచారణ నివేదికను విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపనున్నట్లు విచారణ అధికారులు ప్రసాద్‌బాబు, రాధమ్మ తెలిపారు.


విద్యార్థులను విచారిస్తున్న అధికారులు ప్రసాద్‌బాబు, రాధమ్మ

విచారణ గోప్యం:

పీడీ గోపినాథ్‌పై విచారణ పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి గోప్యంగా ఉంచారు. గతంలో విచారణ సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకే విధంగా సమాధానం చెప్పారు. దీంతో అనుమానంతో విచారణ అధికారులు మరోసారి విచారణ చేశారు.

మృతుడి సమాచారం అందించండి

ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లె మండల కేంద్రంలో ఇటీవల గూడ్స్ రైలు కిందపడి మృతి చెందిన పులి (55) అనే వ్యక్తి గురించి సమాచారం తెలిసి ఉంటే తెలియజేయాలని రేణిగుంట జీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులి అనే వ్యక్తి ఇతర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి నాలుగు సంవత్సరాలుగా మండల కేంద్రంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించినా , పూర్తి పేరు కానీ, ఊరుకానీ స్థానికులకు ఎవరికీ తెలియదన్నారు. దీంతో మృతుని బంధువులు కానీ, తెలిసిన వారు ఎవరూ రాలేదని, ఎవరైనా తెలిసి ఉంటే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ శివ తెలిపారు.

టీడీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు

పీలేరు : ఎన్నికల నియమాలు ఉల్లంఘించి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు టీడీపీ ప్రచారంలో పాల్గొంటూ హల్‌చల్ చేస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. పీలేరు నియోజకవర్గ పరిధిలో చింతపర్తి, గుర్రంకొండ యూనిట్‌లలో ఏపీ సీఎస్‌ఎఫ్ (న్యాచురల్ ఫార్మింగ్)లో ఐసీఆర్‌పీలుగా పని చేస్తున్న జి. హరినాథరెడ్డి, సి. రమేష్‌కుమార్‌రెడ్డిలు టీడీపీ కూటమి ప్రచారంలో పాల్గొంటున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ దర్శనమిస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డితో హరినాథరెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి

రూ.2 లక్షలు సీజ్

కలకడ : రూ.2 లక్షలు నగదును సీజ్ చేసినట్లు కలకడ ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు .. వివరాలిలా ఉన్నాయి. కలకడ సీఐ శ్రీనివాసులు ఆదేశాలమేరకు శుక్రవారం ఎస్‌ఐ తన సిబ్బందితో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ బాటవారిపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తిరుపతి నుంచి రాయచోటి వైపు కారులో ప్రయాణిస్తున్న తిరుపతి జీవకోన కు చెందిన మల్లిశెట్టి భూపతి వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండ రూ. 2లక్షలు నగదు ఉన్నట్లు గుర్తించారు. సదరు నగదుకు రసీదులు చూపాలని కోరినా తెలియజేయకపోవడంతో రూ.2లక్షలు సీజ్‌చేసినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.

చెక్‌పోస్టు తనిఖీ చేసిన ఎన్నికల పరిశీలకుడు


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు ఎస్‌జీ మూన్

సంబేపల్లె : మండలంలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై గుట్టపల్లిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును అన్నమయ్య జిల్లా ఎన్నికల పరిశీలకుడు ఎస్‌జీ మూన్ శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎలాంటి అక్రమ రవాణాకు తావులేకుండా ఉండేందుకు చెక్‌పోస్టులలో గట్టి తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వాహన రికార్డుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఆర్డీఓ రంగస్వామి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలొబిగారి వీధిలో మారం సురేష్, చిన్న వెంకటేష్‌లపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులైన బొమ్మలమణి, సయ్యద్ రుక్సానాలను శుక్రవారం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు.

అశ్వవాహనంపై ప్రతాప రాముడి పార్వేట


అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీ పట్టాభిరాముడు

వాల్మీకిపురం: వాల్మీకి క్షేత్రంలోని పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం రాత్రి 8గంటలకు స్వామివారు అశ్వవాహనంపై పార్వేటకు బయల్దేరారు. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, తిరుచ్చిలో స్వామివారి అలంకరణ, 8నుంచి 9గంటల వరకు తిరుచ్చి ఉత్సవం, స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. సాయంత్రం ఊంజల్ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం వాహన మండపంలో స్వామివారిని విల్లంబులు ధరింపజేసి పార్వేటకు సిద్ధం చేశారు. అశ్వవాహనంపై విల్లంబులతో భక్తులకు ప్రతాప రాముడిగా దర్శనమిచ్చారు. పార్వేట మండపంలో ఆలయ అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు రాములవారి పార్వేట ఉత్సవం గురించి కథారూపంలో భక్తులకు తెలియజేశారు. వేట అనంతరం స్వామివారు తిరుమాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక

భార్య ఆత్మహత్య


ఓబులమ్మ మృతదేహం

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల వెంకటాపురం దళితవాడలో భర్త వేధింపులు తాళలేక పి. ఓబులమ్మ (38) అనే మహిళ శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. పెనగలూరు మండలం సాతుపల్లి గ్రామానికి చెందిన ఓబులమ్మకు గాదెల వెంకటాపురం దళితవాడకు చెందిన పోలమనేని చంద్రకు 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఏడాది నుండి భార్యభర్తల మధ్య గొడవలు ఉండటంతో ఓబులమ్మ తన తల్లిదండ్రుల గ్రామమైన సాతుపల్లెలో ఉంటోంది. ఈ క్రమంలో విడాకులు కావాలని చంద్ర భార్యకు నోటీసులు పంపించాడు. అయితే భర్త, పిల్లలు కావాలని గురువారం సాయంత్రం గాదెల వెంకటాపురం దళితవాడకు వచ్చింది. రాత్రి భార్యా భర్తలు గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి ఉరివేసుకొని ఓబులమ్మ ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. తన చెల్లెలు మృతిపట్ల అనుమానాలు ఉన్నాయని మృతురాలి సోదరుడు ఓబులేశు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబసమస్యల కారణంగా ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె పంచాయతీ నాగులయ్యగారిపల్లెకు చెందిన ఓ యువతి(17) కుటుంబసమస్యలతో పశువులకు వాడే పిడుదుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని 108లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ నిబంధనల ఉల్లంఘన


108 అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోగా, వెనక్కు మళ్లించుకోవాలని చెబుతున్న టీడీపీ నాయకులు


చిత్తూరు బస్టాండ్ సర్కిల్‌లో ఫైర్ ఇంజన్ సైరన్ కొడుతున్నా పట్టించుకోని తెలుగు తమ్ముళ్లు

- అనుమతి లేని డీజే వాహనాలు, టపాకాయల పేలుళ్లు
- 108 వాహనం, ఫైర్ ఇంజన్‌కు దారి ఇవ్వని తమ్ముళ్లు
- నామినేషన్‌కు హాజరుకాని టీడీపీ సీనియర్ నాయకులు
- సీ విజిల్‌కు ఫిర్యాదుచేసినా అధికారుల చర్యలు శూన్యం

మదనపల్లె : మదనపల్లె టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నామినేషన్ దాఖలు ప్రక్రియలో ఆ పార్టీ శ్రేణులు నిబంధనలు ఉల్లంఘించాయి. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసేందుకు టీడీపీ కార్యకర్తలను, నాయకులను మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో బెంగళూరు బస్టాండ్‌లోని పార్టీ కార్యాలయం దగ్గర నుంచి బయలుదేరిన ర్యాలీకి ఆశించిన స్థాయిలో జనాలు లేకపోవడంతో... డీజే వాహనాల మితిమీరిన శబ్దాల హోరులో డ్యాన్సులు, కేకలు వేసుకుంటూ కాలయాపన చేశారు. ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకమైనప్పటికీ పట్టించుకోకుండా పెద్ద ఎత్తున టపాకాయలను పేలుస్తూ, బెంగళూరు బస్టాండు ప్రాంతమంతా పొగ కమ్ముకుపోయేలా చేశారు. తర్వాత 2.10 నిమిషాలకు బయలుదేరిన షాజహాన్‌బాషాకు, నామినేషన్ గడువు ముగిసిపోతోందని నాయకులు చెప్పడంతో...గుట్టు చప్పుడు చేయకుండా.. హోండా యాక్టివా టూవీలర్‌లో ఎక్కి సబ్ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. విషయం తెలియని కార్యకర్తలు, నాయకులు షాజహాన్‌బాషా వస్తారని, డీజే పాటలకు డ్యాన్సులు చేసుకుంటూ ముందుకు సాగారు. ఇంతలో 108 వాహనం చిత్తూరు బస్టాండ్ నుంచి అవెన్యూరోడ్డు మీదుగా జిల్లా ఆస్పత్రికి వెళ్లేందుకు అటువైపుగా వచ్చింది. టీడీపీ కార్యకర్తలు, నాయకులు వాహనానికి దారివ్వకపోగా, ఏకంగా వాహనాన్నే దారి మరల్చుకుని వెళ్లాల్సిందిగా డ్రైవర్‌కు సూచించి, బండికి రివర్స్ చెప్పారు. తర్వాత టౌన్‌బ్యాంక్ సర్కిల్ మీదుగా చిత్తూరు బస్టాండ్‌కు చేరుకుని సబ్ కలెక్టరేట్‌కు 200 మీటర్ల దూరంలో డీజే వాహనాలను నిలుపుకుని, పాటలకు డ్యాన్సులు వేసుకుంటూ షాజహాన్‌బాషా కోసం వేచిచూశారు. నామినేషన్ వేసి, మధ్యాహ్నం .3.10 గంటలకు వెలుపలికి వచ్చిన షాజహాన్‌బాషా, చిత్తూరుబస్టాండులో వాల్మీకి విగ్రహానికి ఆనుకుని, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సరిగ్గా ఆ సమయంలో అటువైపుగా ఓ ఫైర్ ఇంజన్ సైరన్ వేసుకుంటూ వచ్చింది. తెలుగు తమ్ముళ్లు దానికి దారికి ఇవ్వకపోగా, నాయకుడి స్పీచ్ వింటూ తన్మయత్వంలో మునిగిపోయారు. తర్వాత ఎవరో వచ్చి ఫైర్ ఇంజన్ వచ్చిందని చెప్పగానే, స్పీచ్ నిలిపిన షాజహాన్‌బాషా, ప్రచారరథం పైకి ఎక్కి ప్రసంగించారు. షాజహాన్‌బాషా నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకుల నుంచి మద్దతు కరువైంది. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, రాటకొండ బాబురెడ్డి, శ్రీరామ్ చినబాబు, జనసేన రామదాస్ చౌదరి తదితరులు ఎవ్వరూ హాజరుకాలేదు.

సీ విజిల్ యాప్‌కు ఫిర్యాదు..

షాజహాన్‌బాషా నామినేషన్ సందర్భంగా అనుమతి లేని డీజే వాహనాలను వినియోగిస్తూ, కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నాడని సీవిజిల్ యాప్‌కు ఫిర్యాదుచేస్తే... అధికారులు చర్యలు తీసుకోకపోగా, సమస్య పరిష్కరించేసినట్లు ఫిర్యాదుదారుడికి మెసేజ్ పంపారు. అయితే ఫిర్యాదు పరిష్కారానికి తీసుకున్న చర్యలపై కనపరచకపోవడం గమనార్హం.

తమ్ముడిని నాటు తుపాకీతో కాల్చిన అన్న అరెస్ట్


అరెస్ట్ వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

గుర్రంకొండ : ఆస్తి పంపకం వివాదంలో తమ్ముడ్ని నాటు తుపాకీతో కాల్చిన అన్న జయప్ప (56)ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఒక నాటు తుపాకీతో పాటు మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ ఎగువహరిజనవాడ గ్రామానికి చెందిన బాలపోగు జయప్ప, బాలపోగు విశ్వనాథ్‌లు అన్నదమ్ములు. వీరికి గ్రామానికి సమీపంలోనే తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన పొలం ఉంది. ఈ ఆస్తి పంపకం విషయంతో గొడవ పడిన నేపథ్యంలో ఈనెల 16న కోపంతో తమ్ముడిని అన్న నాటు తుపాకీతో కాల్చిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పరారీలో ఉన్న నిందితుడు జయప్పను శుక్రవారం మండలంలోని ఉదారివాండ్లపల్లె క్రాస్ వద్ద అరెస్ట్ చేసినట్లు వాల్మీకిపురం సీఐ పులిశేఖర్, గుర్రంకొండ ఎస్‌ఐ నాగార్జునరెడ్డిలు తెలిపారు.

దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రామసముద్రం : రామసముద్రంలో తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆర్.నడింపల్లె పంచాయతీ బల్లసముద్రం గ్రామానికి చెందిన వానీష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. తమ గ్రామంలో వాలీశ్వర ఆలయంపై గత కొంతకాలంగా ఘర్షణ నెలకింది. ఈ క్రమంలో దేవాదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఈఓ వాలీశ్వర ఆలయంలో తాళాలు వేసి భద్రపరిచారన్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామానికి చెందిన జి.మనోహర్‌బాబు, మల్లికార్జున , గంగన్న, వెంకటరెడ్డి , శ్రీనివాసులు అనే వ్యక్తులు తాళాలు పగులగొట్టి పూజలు చేశారు. ఈ విషయంపై ఈఓ వారిని విచారిస్తుండగా గ్రామస్తులైన నారాయణ, వాలిరెడ్డి, కృష్ణప్ప, మల్లెప్ప, అర్చకులు లోకనాథ్‌దీక్షిత్ తో పాటు తనను కూడా పిలిపించారన్నారు. అయితే వారు అర్చకులను దుర్భాషలాడుతూ కొట్టేందుకు వెళ్లగా తాను అడ్డుకున్నందుకు తనపై, అర్చకుడు లోకనాథ్‌దీక్షిత్‌పై మనోహర్‌బాబు , మల్లికార్జున, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, గంగన్నలు బలమైన కర్రలతో తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. అడ్డుకోబోయిన తమ పెద్దమ్మ గంగులమ్మ చేయిని విరగొట్టారన్నారు. తనను గ్రామస్తులు చికిత్స నిమిత్తం పుంగనూరు ఆసుపత్రికి తరలించారన్నారు. వారితో తమకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ఇరువర్గాలపై ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


దాడిలో తీవ్రంగా గాయపడిన వానీష్‌కుమార్